
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.8 ၊ కనిష్ఠం 24.6





ఇక పల్లెపోరు!

- పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి
- ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు
- జిల్లా అధికారుల నుంచి వివరాలు తీసుకుంటున్న ప్రభుత్వం
- కసరత్తు ప్రారంభించిన అధికారులు
- వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించే అవకాశం
- ప్రయత్నాలు మొదలుపెట్టిన ఆశావహులు
- జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు, 4,642 వార్డులు

కామారెడ్డి, మే 19(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ఇక పంచాయతీ ఎన్నికల వంతు రానుంది. పల్లెపోరుపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గత ఫిబ్రవరిలోనే పంచాయతీలకు పదవీకాలం ముగియడంతో అప్పటి నుంచి వాటిలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. వాస్తవంగా జనవరిలోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ పోరును వాయిదావేస్తూ వచ్చారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసింది. జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఆ వెంటనే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల జూన్ మాసంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పార్టీలు, ఆశావహులు పోటీ చేసేందుకు తమ ప్రయత్నాలు మొదలుపెట్టడంతో గ్రామాల్లో మళ్లీ ఎన్నికల సందడి మొదలైంది.

జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం మొత్తం 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,642 వార్డులు ఉన్నాయి. వీరందరి పదవికాలం ఇప్పటికే ముగిసింది. 2019 ఓటరు జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 5,18,204 ఓట్లు ఉన్నాయి. ఇందులో పురుషులవి 2,50,447, మహిళలవి 2,82,613, థర్డ్ జండర్‌వి 4 ఓట్లు ఉన్నాయి. అయితే జిల్లాలో 526 గ్రామ పంచాయతీలే కాకుండా మరో 9 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు గతంలోనే ప్రభుత్వానికి జిల్లా అధికారులు నివేదించారు. ఈ కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

సిద్ధంగా ఉండాలని ఆదేశాలు

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అందుకోసం యంత్రాంగం సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో జిల్లా అధికారులు గ్రామ పంచాయతీకి సంబంధించి రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి పంపించారు. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్స్‌లు ఎన్ని ఉన్నాయనేది కూడా తెలియజేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించనున్నారు. సర్పంచ్‌లను నేరుగా ఎన్నుకోనుండగా ఉప సర్పంచ్‌లను పరోక్ష పద్ధతిన ఎన్నుకుంటారు. వార్డు సభ్యులు, సర్పంచ్ ఎన్నికల కోసం ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తారు. సర్పంచ్, వార్డు సభ్యునికి వేర్వేరుగా తెలుపు, గులాబీ రంగు బ్యాలెట్ పేపర్లను ముద్రణకు చర్యలు చేపడుతున్నారు. ఈ ఎన్నికలకు పార్టీ గుర్తులు ఉండవు. కావున ముందుగానే ముగ్గురు, నలుగురు పేర్లతో కూడిన నమూనా బ్యాలెట్ పేపర్లను రూపొందిస్తున్నట్లుగా తెలిసింది. 200ల మందికోక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఒక సహాయ అధికారి ఉంటారు.

దగ్గరపడుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం

స్థానిక సంస్థల పదవీకాలం ఒక్కొక్కటిగా ముగుస్తూ వస్తోంది. గత ఫిబ్రవరి 2వ తేదీన సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. మరోవైపు జూలై 2వ తేదీన జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం కూడా పూర్తికానుంది. దీంతో ప్రభుత్వం ఈ ఎన్నికలు ముందుగా నిర్వహించాలనే ఆలోచనలు కూడా చేస్తోంది. అయితే జూన్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఆ వెంటనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోతే ప్రత్యేకాధికారుల పాలన పెట్టాల్సి వస్తోంది. దీని వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండడంతో వాటి ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతోంది.

పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామ, మండల స్థాయిలో పని చేసి పార్టీల గెలుపునకు కృషి చేసిన నాయకులంతా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల అప్పుడే తాము పోటీ చేస్తామని బహిరంగంగానే చెబుతున్నారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ నుంచే ఆశావహులు పెద్ద సంఖ్యలో ఉండనున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌కు పని చేసిన వారు ఎన్నికల ముందు, తర్వాత పార్టీలోకి వచ్చిన నేతలు కూడా పెద్ద ఎత్తున ఉన్నారు. దీంతో అభ్యర్థుల ఎంపిక ఆ పార్టీకి తలనొప్పిగా మారే అవకాశం ఉంది. దీంతో ఆశావహులు ఇప్పటి నుంచే తమ పార్టీ ముఖ్యులను కలుస్తూ ఎన్నికల్లో ఏ విధంగా కష్టపడాలో తెలియజేస్తు మద్దతును పొందే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా పంచాయతీ ఎన్నికల్లో తమ గ్రామం ఏ రిజర్వేషన్‌కు వస్తుందోనని పల్లెల్లో చర్చ మొదలైంది.



కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

టీఎస్‌కు బదులుగా టీజీని వాడాలి

● కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మే 19: తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులుగా టీజీగా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవోలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్‌హెడ్‌లలో టీజీగా ఉండాలని, ప్రభుత్వ శాఖలు, సంస్థలు అటనామస్ విభాగాలన్నీ దీనిని పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని ఆయన తెలిపారు. తెలంగాణలో ఇప్పటి వరకు వాహనాల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితమైన టీజీ నిబంధనల ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అధికారిక వ్యవహారాలకు వర్తింపజేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తక్షణమే ఇది అమలులోకి వస్తుందని తెలిపారు. ఇకపైన టీఎస్ అబ్రివేషన్ స్థానంలో అధికారికంగా టీజీ అని మార్చుకునేలా మే 30వ తేదీన డెడ్‌లైన్‌గా ఉందని, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలన్నింటికి ఇది వర్తిస్తుందన్నారు. వెబ్‌సైట్లతో పాటు అన్ని రకాల ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు, రిపోర్టుల్లో ఇకపైన టీజీ పదాన్నే వినియోగించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం టీజీ అనే అబ్రివేషన్‌ను అధికారికంగా గుర్తించడంతో ఈ మార్పును అన్ని విభాగాలు అమల్లోకి తెచ్చేలా ఆయా డిపార్ట్‌మెంట్ల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పర్యవేక్షించాలని సీఎస్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు.

ఐదు రోజుల్లోగా 95 శాతం పంట కొనుగోలు చేస్తాం

రామారెడ్డి: రాబోయే ఐదు రోజుల్లో 95 శాతం పంట కొనుగోలు చేస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఆదివారం మండలంలోని పోసానిపేట, గిద్దలో కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి పరిశీలించారు. అక్కడ ధాన్యంలో తేమను పరిశీలించి రైతులతో మాట్లాడి భరోసా కల్పించారు. జిల్లాలో ఇప్పటి వరకు 350 కొనుగోలు కేంద్రాల ద్వారా 46,613 మంది రైతుల నుంచి 576 కోట్ల విలువ గల 2.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలో 504 కోట్లు జమ చేశామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 200 కేంద్రాల్లో పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. మరో రెండు రోజుల్లో 30 కేంద్రాల్లో ధాన్యాన్ని, ఆ మరో రెండు రోజులలో 40 కేంద్రాల్లో ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు, తహసీల్దార్‌లు, ఉప తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులోని సిద్ధరామేశ్వర ఆలయం

సిద్ధరామేశ్వర ఆలయంలో వాస్తు హోమం

భిక్కనూరు, మే 19: మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 29 వరకు వాస్తు హోమ కార్యక్రమాలను ఉడిపి వాస్తు పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీధర్, కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు, హోమ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీరప్ప ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు

భిక్కనూరు, మే 19: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారి పక్కన ఇటీవల కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన బీరప్ప ఆలయంలో స్వామి వారి, కామరతి అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం కురుమ సంఘం ప్రతినిధులు వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి, అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి, డోలు చప్పుళ్ల నడుమ బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కురుమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం ప్రతినిధులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం

- వానాకాలం పంటల ప్రణాళిక తయారు
- సాగు అంచనాలు సిద్ధం చేసిన జిల్లా వ్యవసాయ శాఖ
- జిల్లాలో 5.19 లక్షల ఎకరాల్లో సాగు

నాగిరెడ్డిపేట, మే 19: వానాకాలం(ఖరీఫ్) సీజన్ పంటల సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఏ పంట ఎంత మేరకు అవసరమవుతాయని, ఏ మేరకు ఎరువులు అవసరమవుతాయో అంచనాలను రూపొందించారు. గత వానాకాలం సీజన్ కంటే ఈ సారి సాగు విస్తీర్ణం కొంత మేర పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు.

తొలకరి వర్షాలపైన ఆశలు

నిజాంసాగర్, పోచారం సాగునీటి ప్రాజెక్టులతో పాటు కుంటలు, బోరు బావులపైన ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తారు. వానాకాలంలో జిల్లాలో ప్రధాన పంటగా రైతులు వరి పంటను సాగు చేస్తారు. వరితో పాటు మొక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు, మినుములు, సోయాబీన్, పత్తి తదితర రకాల పంటలను సాగు చేస్తారు. ఈ సారి తొలకరితోనే వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు వానాకాలం సీజన్ పంటల సాగుపై ఆశలు పెంచుకున్నారు.

జిల్లాలో వివిధ పంటల సాగు ఇలా..

ఈసారి జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 5 లక్షల 19 వేల 54 ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగు చేస్తారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ప్రధాన పంటగా జిల్లా రైతులు వరి పంటను సాగు చేస్తారు. ప్రధాన పంట అయిన వరి అత్యధికంగా 3,18,965 ఎకరాలలో, మొక్కజొన్న 57,315, సోయాబీన్ 85,444, పత్తి 28,730, కందులు 14,961, పెసర్లు 4,997, మినుములు 5,263, జొన్న 577 ఎకరాల్లో సాగు చేయనుండగా వీటితో పాటు రైతులు వివిధ రకాల పంటలు సాగు చేయనున్నారు. గతేడాది జిల్లాలోని అన్ని రకాల 5,18651 ఎకరాలలో పంటలు సాగు కాగా ఈసారి వానాకాలంలో కొంత మేర విస్తీర్ణం పెరగనుంది. జిల్లాలో ఈ వానాకాలంలో 5,19,054 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

విత్తనాలు, ఎరువుల సరఫరాపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో వానాకాలంకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచడానికి జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో వివిధ రకాల పంటల సాగు కోసం 1,10,284 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వరి విత్తనాలు 74,492 క్వింటాళ్లు, జొన్న 4,582, సోయాబీన్ 25,633, పత్తి 287, పెసర్లు 400, మినుములు 421, కంది 419, జొన్న 47 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అధికారులు విత్తనాలను అందుబాటులో ఉంచనున్నారు. అలాగే జిల్లాలో వివిధ రకాల పంటల సాగు కోసం 1,05,997 మెట్రికల్ టన్నులు వివిధ రకాల ఎరువులు అవసరం అవుతాయని అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. అందులో యూరియా, 50,908 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే, కాంప్లెక్స్ ఎరువులు 33,250 మెట్రిక్ టన్నులు, డీఏపీ 13,143 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 8,696 మెట్రిక్ టన్నులు టన్నులు అవసరం ఉంటాయని అధికారులు అంచనాలు వేశారు. వానాకాలం పంటల సాగుకు జిల్లాలో ఎలాంటి రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండా అధికారులు ఎరువులను అందుబాటులో ఉంచనున్నారు.

60 శాతం ప్రభుత్వ రాయితీపై పచ్చి రొట్టె విత్తనాలు

పంటల సాగుకు ముందు రైతులు భూసారం పెంచేందుకు, అధిక పంట దిగుబడి కోసం పచ్చి రొట్టె ఎరువులను వాడతారు. పచ్చి రొట్టె ఎరువులైన జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను జిల్లాలో రైతులకు 60 శాతం ప్రభుత్వం సబ్సిడీపైన వ్యవసాయ శాఖ అధికారులు అందజేస్తున్నారు. పచ్చిరొట్టె విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.



నాగిరెడ్డిపేటలో వానాకాలం పంటల సాగు కోసం దుక్కి దున్నుకున్న రైతులు

2024 ఖరీఫ్ పంటల సాగు ప్రణాళికలు సిద్ధం చేశాం


● జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి భాగ్యలక్ష్మి

జిల్లాలో 2024 ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం ప్రణాళికలు సిద్ధం చేశాం. ఖరీఫ్ సీజన్‌లో 5,19,054 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేయనున్నట్లు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఖరీఫ్ పంట సాగు కోసం వివిధ రకాల విత్తనాలు 1,10,284 క్వింటాల్ అవసరం ఉన్నట్లు ప్రణాళికలు రూపొందించాం. జిల్లా రైతులకు కావాల్సిన వివిధ రకాల విత్తనాలను, ఎరువులను ఎలాంటి కొరత లేకుండా జిల్లాలో రైతులకు అందుబాటులో ఉంచడానికి అన్ని చర్యలు చేపడుతున్నాం. రైతులకు అధిక దిగుబడులనిచ్చే నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేసి పంటల సాగు చేపట్టాలి. అధిక దిగుబడులు సాధించాలి.

అంగన్‌వాడీ కేంద్రమే..
పంచాయతీ కార్యాలయం!

- ఒక వైపు అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ
- మరో వైపు అదే కేంద్రంలో గ్రామ కార్యదర్శి విధుల నిర్వహణ
- గ్రామ పంచాయతీ భవనం లేక గ్రామ కార్యదర్శికి విధుల పట్ల ఇబ్బందులు
- నూతన గ్రామ పంచాయతీ భవనం ఏర్పాటు చేసేంత వరకు అక్కడే విధుల నిర్వహణ

బాన్సువాడ, మే 19: గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా గ్రామ పంచాయతీ కార్యదర్శి నేరుగా గ్రామంలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు విధులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అదే గ్రామ పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల సమస్యలు వస్తే ఎవరూ పరిష్కరిస్తారు అనేది ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు నేరుగా గ్రామ పంచాయతీ కార్యదర్శికి వెళ్లి మొరపెట్టుకుంటారు. కానీ ఇక్కడ చివరికి గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమస్య వస్తే ఎవరు పరిష్కరిస్తారు. ఎవరికి మొర పెట్టుకోవాలని అయోమయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారు. పిల్లలకు గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రమే గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ కార్యాలయంగా మారింది అని చెప్పుకోవచ్చు. బాన్సువాడ మండలం పులిగుండు తండా గ్రామ పంచాయతీకి భవనం లేక అంగన్‌వాడీ కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం గ్రామంలో పాత అద్దె భవనం ఉన్నప్పటికీ ఆ భవనాన్ని తొలగించడంతో కార్యదర్శి భవనం లేక గ్రామస్థులు, అధికారులు గ్రామ పంచాయతీ భవనాన్ని అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు, గర్భిణులు అంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. అంగన్‌వాడీ కేంద్రంలో పంచాయతీ కార్యాలయం విధులు నిర్వహించడం ఏ విధంగా సాధ్యమవుతుందని అటు పిల్లలు, గర్భిణులు ఎక్కడ కూర్చోవాలో తెలియక అవస్థలు పడుతున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ సమయంలో పిల్లలు, గర్భిణులు వచ్చినప్పుడు వారికి భోజనం వండి పెట్టే సమయంలో పంచాయతీ కార్యదర్శి ప్రజలు కేంద్రంలో ఉండటంతో విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అటు అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు ఇటు కార్యదర్శి పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నూతనంగా ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకురావాలని లేని యెడల మరొక భవనంలోకి మార్చి అంగన్‌వాడీ నిర్వహణకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులకు అటంకం కలుగకుండా ప్రత్యేక భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



పులిగుండు తండా అంగన్‌వాడీ కేంద్రం ఇదే..



అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి

యూనిఫాంల బాధ్యత ఐక్య సంఘాలదే

● విద్యార్థుల వివరాలు సేకరించిన మహిళ సంఘాల సభ్యులు ● పాఠశాల పునఃప్రారంభం నాటికి దుస్తులు సిద్ధం

డొంకేశ్వర్,మే19: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలను అందించే బాధ్యత ప్రభుత్వం స్వయం సహయక సంఘా లకు అప్పగించింది. పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేలా విద్యాశాఖ అధికారులు, ప్రణాళికలు రూపొందించారు. ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించనున్నారు.

● విద్యార్థుల కొలతలు సేకరణ

డొంకేశ్వర మండలం పరిధిలో 19పాఠశాలల్లో బాలురు 756, బాలికలు 659 ఉన్నారు. మొత్తం 1415మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున 2830 దుస్తుల తయారీకి అధికారులు అంచనా వేశారు.వారికి జూన్12న పాఠశాల పున: ప్రారంభం అవు తుంది. పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లను అందించాలని నిర్ణయించారు. దీంతో విద్యార్థుల చదువుకు అటంకం కలుగకుండా ఉంటుందని ఉన్నతాధికా రులు భావిస్తున్నారు. ఈ విద్య సంవత్సరం పూర్తి కాక ముందు మహిళా సంఘాలు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల వివరాలు నమోదు చేసుకున్నారు. మహిళ సంఘాలలో సభ్యురాలు అయి ఉండి సంఘం ద్వారా రుణం తీసుకొని స్టిచ్చింగ్‌పై ఉపాధి పొందుతున్న మహిళలకు గుర్తించి ఐకెపి ద్వారా విద్యార్థులకు దుస్తులను సిద్ధం చేసేందుకు గాను అధికారులు చర్యలను చేపట్టారు. పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు దుస్తులు అందించేందుకు గాను పనులను వేగవంతం చేశారు. గ్రామాల్లో ఉపాధి లేకుండా ఉండి స్టిచ్చింగ్‌పై ఆధారపడి పని చేస్తున్నా వారిని గుర్తించి గ్రూపులుగా ఏర్పాటు చేసి మహిళా సంఘాల ద్వారా ఉపాధి కల్పిస్తున్నారు.



డొంకేశ్వర్‌లో విద్యార్థుల యూనిఫాం కొలతలు తీసుకుంటున్న మహిళా సంఘ సభ్యులు

విద్యార్థుల కొలతలను సేకరించి స్టిచ్చింగ్ పనులను మొదలు పెట్టానున్నారు. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు స్వయం ఉపాధి పొందేందుకు తోడ్పడుతుంది. స్టిచ్చింగ్ చేస్తూ వచ్చే డబ్బుతో కుటుంఆన్ని తోడుగా ఉంటుంది.

● ఒక్కో జతకు రూ.50

విద్యార్థులకు ప్రతీ ఏటా రెండు జతల యూనిఫాంలను అందిస్తున్నారు. ఒక్కో జతకు రూ.50చొప్పున రెండు జతలకు రూ.100 మహిళా సంఘానికి అందిస్తారు. ప్రభుత్వం అందించే కుట్టుకూలీ చార్జీలు సరిపోవని గ్రామ ఐక్య సంఘాలు పేర్కొంటున్నాయి. దీంతో కొంత మంది ఆసక్తి చూపడంలేదు. గత ఏడాది వరకు పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను అందించే బాధ్యతను హెచ్‌ఎంలకు అప్పగించే వారు. పాఠశాల నిధులతో పాటు ఈపనులు భారం కావడంతో యూనిఫాంల బాధ్యత గ్రామ ఐక్యసంఘాలకుఅప్పగించారు.సంఘాలలో ఉన్న సభ్యులకు చేయడానికి పనులు అప్పగిం చారు.

అవగాహన కల్పిస్తున్నాం

స్టిచ్చింగ్ చేసి మహిళలకు ఒక్క జతకు రూ.50 చెల్లిస్తున్నారు. అవి సరిపోవడంలేదని వారు అంటున్నారు. మహిళ సంఘాలకు ఇవ్వడం ప్రభుత్వం మొదటి సారి కాబట్టి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న సంఘాలు విద్యార్థులకు సకాలంలో యూని ఫాంలు అందించేలా స్వయం సహయక సంఘాలకు అవగాహన కల్పిస్తున్నాం. సభ్యులు పాఠశాలలకు క్షేత్రస్థాయిలో వెళ్ళి వివరాలు నమోదు చేశారు.

- మాణిక్యం, ఏపీఎం

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెండోర, మే19: మండలంలో పోచంపాడ్ తెలంగాణ రాష్ట్ర బాలికల, గురుకుల పాఠశాల, కళాశాల పోచంపాడ ఎక్స్‌రోడ్డులో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ఎంపీసీ, బైపీసీలో ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు విద్యార్హతలు అనుభవం కలిగి అతిథి ఉపాధ్యాయులు విద్యార్హతలు అనుభవ సర్టిఫికెట్లు జతచేసి 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బౌతికశాస్త్రం, రసాయనిక శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం సబ్జెక్టుల్లో డిగ్రీ పోస్టు గ్రాడ్యుయేషన్ బీఎడ్‌లో సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులని మరిన్ని వివరాలకు 9701222079నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెంజల్,మే19: రెంజల్ మండలం కందకుర్తి గోదావరి నదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్టు రెంజల్ ఎస్ఐ సాయన్న తెలిపారు. మృతుడి వయసు దాదాపు 45నుంచి 55సంవత్సరాలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే రెంజల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు

అంతర్జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలకు పెర్కిట్‌వాసి

ఆర్మూర్‌రూరల్, మే19: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్ పీఈటీ అఖిల్ శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషల్ టెన్నిస్ బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు శ్రీలంకలో జరిగిన పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అఖిల్ భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచేందుకు తనవంతు కృషి చేశాడని కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి తెలిపారు. భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన అఖిల్‌ను పలువురు అభినందించారు.

కమ్మర్‌పల్లిలో ప్రభుత్వ కళాశాల ప్రవేశాలు ప్రారంభం



అడ్మిషన్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు

కమ్మర్‌పల్లి, మే 19: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థుల అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ చిరంజీవి తెలిపారు. ఈ మెరకు మండలపరిధి గ్రామాలులో గతమూడు రోజులగా అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తు నేరుగా అడ్మిషన్‌లు తీసుకుంటున్నట్లు తెలిపారు., ఈ ఏడాది కళాశాలలో అన్ని గ్రూప్‌లకు కలిపి సుమారు 150 నుంచి 2వందలవరకు అడ్మిషన్‌లు చేయాలని లక్ష్యంగా అడ్మిషన్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కమ్మర్‌పల్లి మండల పరిధి గ్రామాలతో పాటు చుట్టుపక్కలా వివిధ మండలాలకు చెందిన గ్రామస్థులు కమ్మర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని గ్రూప్‌లకు సంబంధించి అడ్మిషన్‌లు చేయించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పదోతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరు తమ కళాలాలో అడ్మిషన్ తీసుకోవాలన్నారు. జనరల్ కోర్సులైన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ ఈసీ తెలుగు, ఇంగ్లీస్ మీడియంలలో ప్రవేశాలు జరుగుతున్నాయని విద్యార్థులు పదోతరగతి ఇంటర్నెట్ పాస్ మెమో,మూడు పాస్‌పోట్ సెజ్ ఫోటోలు, అధార్ జిరాక్స్ కాసీలతో కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలోగల కళాశాలలో అడ్మిషన్‌లు పొందాలని సూచించారు.

జీపీ వాహనాలకు నిర్వహణ భారం

● కిస్తులు చెల్లించేందుకు కార్యదర్శుల సతమతం
● సీజ్‌చేస్తామని బ్యాంకు అధికారుల ఒత్తిడి



గ్రామ పంచాయతీ ట్రాక్టర్

మద్నూర్, మే 19: గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ట్రాలీ నిర్వహణ భారంగా మారింది. వాటి నెలవారి కిస్తులు చెల్లించేందుకు కార్యదర్శులు సతమతం అవుతున్నారు. డబ్బులు లేక నానాయాతన పడుతున్నారు.

● కొత్త చట్టం మేరకు

1994లో తీసుకుని వచ్చిన పంచాయతీ రాజ్ చట్టంలో బాధ్యతలు, విధులు సరిగ్గా లేవని, అసంపూర్తిగా ఉందని, దానిని గత ప్రభుత్వం రద్దు చేసి 2018లో కొత్త పంచాయతీ రాజ్ చట్టాన్ని అమలులోకి తీసుకుని వచ్చింది. కొత్త చట్టంలో మన ఊరు - మన ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు, మొక్కల పరిరక్షణ, డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించి, ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలను గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయం నుంచి సరిచేసుకోవాలని, వాయిదాల పద్దతిలో చెల్లించేలా వాహనాలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది.

● ట్రాక్టర్లకు రెగ్యులర్ డ్రైవర్లు లేరు

వాహనాలకొనుగోలుకు ఉత్తర్వులు ఇచ్చారు కానీ ప్రభుత్వం డ్రైవర్ల నియామకంపై ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో మల్టీపర్పస్ నెట్టుకుని వస్తున్నారు. దీంతో అర్హత లేని డ్రైవర్లతో కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. వాహనాలు మరమ్మతులకు గురికావడమే కాకుండా ప్రమాదాలకు గురై పోలీస్ కేసుల వరకు వెళ్లిన సందర్భాలున్నాయి. కార్యదర్శులను బాధ్యులు చేస్తూ పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. మల్టీపర్పస్ వర్కర్లలో విద్యార్హత లేక లైసెన్సు లేని డ్రైవర్లతో వాహనాలను నడిపిస్తూ చెత్త సేకరణ చేస్తున్నారు. దీంతో వాహనం మరమ్మతులకు గురికావాల్సి వస్తుంది. గత ఐదు నెలల నుంచి సిబ్బందికి వేతనాలు లేకపోవడంతో కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. జనవరి నెలలో ప్రభుత్వం నిధులు విడుదల చేయగా, ఫిబ్రవరి నుంచి ఈ నెల వరకు నిధులు లేకపోవడంతో జీపీ ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు వాహనాల నిర్వహణ భారం తగ్గించడానికి నిధులు విడుదల చేయాలని గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు కోరుతున్నారు. ప్రభుత్వం ఫిబ్రవరి నెల నుంచి ప్రత్యేకాధికారులను నియమించింది. గ్రామ పంచాయతీలకు లాభాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామాల్లో పడకేసిన ప్రత్యేకాధికారుల పాలన

● గ్రామ పంచాయతీల్లో ఖజానా ఖాళీ ● గ్రామాల్లో పనుల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు, పారిశుద్ధ్యం అస్తవ్యస్థం ● సిబ్బంది వేతనాల చెల్లింపులకూ ఇబ్బంది



జాగిర్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

భీమ్‌గల్‌రూరల్, మే19: ఈ ఏడాది జనవరి నెలాకరుకు సర్పంచ్‌లు, పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. గ్రామాల్లో పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే ప్రత్యేక అధికారులు మాత్రం గ్రామ పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదో మొక్కుబడిగా వారానికి, పదిరోజులు గ్రామపంచాయతీ కార్యాలయాలకు వచ్చి వెళ్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీల్లో ఏమైనా అత్యవసర పనులు వుంటే కార్యదర్శుల పైనే ప్రత్యేక అధికారులు భారం మోపుతున్నారు. నిధుల వినియోగానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రత్యేక అధికారులకు చెక్‌పవర్ ఇచ్చారు. అయితే నిధుల లేమితో ప్రత్యేక అధికారులు ఏమి చేయలేనటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పైనే పూర్తిస్థాయి బాధ్యతలు పడుతున్నాయి. గ్రామాల్లో పనుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

● గ్రామాల్లో చేయాల్సిన పనులివే..

గ్రామ పంచాయతీల ఖజానా ఖాళీ అయ్యింది. నిధుల లేమితో గ్రామాల్లో అత్యవసరంగా చేయాల్సిన పనులు కూడా కుంటుబడుతున్నాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా చేపట్టాల్సిన పనులకు పైసలు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. గ్రామాలలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. డ్రైనేజీలో పూడికి తీత పనులు, చేతి పంపుల రిపేర్లు చేయాల్సి ఉంది. గ్రామాలలోని వీధిలైట్లు, బ్లీచింగ్ కొనుగోలు చేసేందుకు నిధుల కొరత ఏర్పడింది. గ్రామ పంచాయతీల్లో పనిచేసే మల్టీ పర్పస్ వర్కర్లకు నెలనెలా వేతనాలు ఇచ్చేందుకు కూడా కొన్ని గ్రామపంచాయతీల్లో కటకట వుంది. చెత్తను సేకరించే ట్రాక్టర్లకు డిజీల్, మెయింటెనెన్స్‌కు కూడా ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితులు గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఆర్థికభారం మోపుతున్నాయి. జనవరి నెలలో కేంద్రం నుంచి 15 వ ఆర్థిక సంఘం నిధులు కొద్దిమేరా గ్రామపంచాయతీ ఖాతాలో జమఅయ్యాయి. ఈ నిధులతోనే గ్రామపంచాయతీ కార్యదర్శులు గత ఐదు నెలలుగా నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్‌ఎఫ్‌సీ నిధులు విడుదల కాలేదు. గతంలో సర్పంచ్‌లు చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించాల్సి వుంది. గ్రామాల్లో చెత్తసేకరణకు, మొక్కలకు నీరు పట్టించేందుకు కొనుగోలు చేసిన ట్రాక్టర్, ట్రక్కు ట్యాంకర్లకు సంభందించి తీసుకున్న ఫైనాన్స్ కిస్తీలను కూడా కొన్ని గ్రామపంచాయతీలు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నాయి. గతంలో గ్రామాలలో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించిన కాంట్రాక్టర్లు కూడా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. భీమ్‌గల్ మండలంలో 27 గ్రామ పంచాయతీల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్యం పడకేసింది. ముఖ్యంగా గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పడడంతో గిరిజన తండాల్లోని గ్రామపంచాయతీ పరిస్థితి మరీ దారుణంగా మారింది.

గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వుంది



గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో కార్యదర్శులతో పాటు సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. నిధుల కొరత వుంది. పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము.

- సంతోష్ కుమార్, ఎంపీడీవో, భీమ్‌గల్

సల్లంగా చూడు పెద్దమ్మ తల్లి


మెండోరలో పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ముదిరాజ్‌లు

మెండోర, మే19: సల్లంగా చూడు పెద్దమ్మతల్లి అంటూ ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకు న్నారు. ఆదివారం మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లికి పవిత్ర పుణ్యక్షేత్ర గోదావరి నది నుంచి గంగజలాలను తీసుకువచ్చి గంగాజలాలతో అభిషేకం చేసి అమ్మవారికి బెల్లం అన్నంతో నైవేద్యం చూపించి అమ్మవారిని దర్శించుకుని పాడి పంటలు, వ్యాపారాల్లో అధిక లాభాలు వచ్చేటట్టు కరుణ చూపాలని అమ్మవారికి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ కులస్థులు, కుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పచ్చలనడ్కుడలో ఒకచోట కలిసిన 1996-97 పూర్వవిద్యార్థులు

వేల్పూర్,మే15: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో విద్య సంవత్సరం పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు 27ఏళ్ల తర్వాత ఆదివారం ఒక చోట కలుసుకొని పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగులుగా స్థిరపడిన పూర్వవిద్యార్థులు పచ్చలనడ్కుడ ప్రభుత్వ పాఠశాలకు చేరుకొని కార్యక్రమం జరుపుకున్నారు. 27ఏళ్ల తర్వాత తామందరం ఒక చోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు, ప్రస్తుత వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులకు పూలమాలలు, శాలువ, జ్ఞాపికలతో సన్మానించుకొని ఆశీర్వదాలు తీసుకున్నారు. అంతకు ముందు వారు చదివిని పాఠశాల తరగతి గదుల వద్దకు చేరుకొని గత స్మృతులను, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారందరు సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందంతో మునిగితేలారు.

ముప్కాల్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీసమ్మేళనంలో కలుసుకున్న 25ఏళ్ళ పూర్వవిద్యార్థులు

ముప్కాల్, మే19: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1998-99విద్యసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 25ఏళ్లు పూర్తి సందర్భంగా సిల్వర్ జూబ్లీని ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో, వ్యాపారాల్లో, ఉద్యోగాలలో స్థిరపడి ఒక చోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరిం చుకుంటూ యోగక్షేమాలు, పాఠశాల తరగతి గదులలో తిరుగుతూగత స్మృ తులను, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యానభ్యాసించిన గురువులు ప్రధానోధ్యాయులు లక్ష్మారెడ్డి, ముత్తెన్న, లింబాన్న, తదితర ఉపాధ్యా యులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో పూర్వ విద్యార్థులు బాగ్యలక్ష్మీ, వాణి, సంధ్య, దత్తు, దిలీప్, కిరణ్, పవన్, రహీం, కిశోర్, శ్రీహరి, శ్రీకాంత్‌యాదవ్; తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


రామారెడ్డిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రామారెడ్డి,మే 19: రామారెడ్డి మండల కేంద్రంలో ఆదివారం 1991-92 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా గురువులను సన్మానించి వారికి పూలమాలతో సత్కరించారు. వారితో చదువుకున్న కొంతమంది విద్యార్థులు మృతిచెందడంతో ఒక నిమిషం మౌనంపాటించారు.32 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో అందరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనందంగా గడిపారు.

కామారెడ్డిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఒకే దగ్గర కలుసుకున్న (1998-99) బ్యాచ్ పూర్వవిద్యార్థులు

కామారెడ్డిటౌన్,మే 19: కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఆదివారం పూర్వ విద్యార్థులు అపూర్వసమ్మేళనం నిర్వహించారు. 1998-99 విద్యాసంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు కలుసుకుని 25 సంవత్సరాల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆప్యాయంగా గడిపారు. తమకు చదువుచెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

నేటి నుంచి 60 శాతం రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ

బీర్కూర్, మే 19: వ్యవసాయ శాఖ ద్వారా బీర్కూర్, దామరంచ సహ కార సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి 60 శాతం రాయితీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. బీర్కూర్ సహకార సంఘంలో 166 బస్తాలు, దామరంచ సంఘంలో 166 బస్తాల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒక బస్తా (30 కేజీలు) రూ.1116 అందిస్తున్నామన్నారు. కావాల్సిన వారు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు మొబైల్ నెంబర్ అందించాలన్నారు.

చిన్నవాల్గోట్‌లో ఊరపోచమ్మకు బోనాలు


చిన్నావాల్గోట్‌లో బోనాలెత్తిన గ్రామస్తులు

సిరికొండ, మే 19: గ్రామంలో నూతన విగ్రహాలను ప్రతిష్ఠించడంతో గ్రామస్థులు ఊరపోచమ్మకు బోనాలను సమర్పించారు. ఆదివారం సిరికొండ మండలం చిన్నావాల్గోట్ గ్రామంలో నూతనంగా విగ్రహాలను తయారు చేసి ప్రతిష్ఠించినందున గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఊరపోచమ్మకు బోనాలను తీసి నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు మహిళలు పెద్ద సంఖ్యల పాల్గొన్నారు.

చిన్నారి ప్రాణం తీసిన కూలర్


చిన్నారి స్నిటిక (ఫైల్)

ఆర్మూర్‌రూరల్, మే19: అప్పటి వరకు సంతోషంగా ఆడుకుంటున్న చిన్నారికి కూలర్‌షాక్ తగిలి మృతి చెందిన సంఘటన ఆర్మూర్‌లో శనివారం రాత్రి జరిగింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గంగస్థాన్ ప్రాంతానికి చెందిన వినిత్ దీపికల కూతురు స్నిటిక(7) వేసవి సెలవులు ఉండడంతో ఆర్మూర్‌లోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. తోటి స్నేహితులతో ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు చిన్నారి స్నిటిక కూలర్‌ను ముట్టుకోవడంతో కూలర్‌కు విద్యుత్ సరఫరా అయిషాక్ తగలడంతో అక్కడి కక్కడే మృతి చెందింది. కొద్దిసేపటి వరకు తమ కళ్ల ముందు ఆడుకుం టున్న చిన్నారి విద్యుత్‌షాక్ గురై మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.మృతిచెందిన చిన్నారికి నిజామాబాద్‌లో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే


సినిమాకు క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే

నిజాంసాగర్, మే 19: నిజాంసాగర్ ప్రాజెక్టును ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంత్‌రావు సందర్శించారు గోల్‌బంగ్లా, తదితర ప్రాజెక్టు పైగల కట్టడాలను ఎమ్మెల్యే స్నేహితులు, అమెరికాకు చెందిన శాస్త్రవేత్త స్టీవ్ బిల్తెడ్‌తో కలిసి సందర్శించారు. ప్రాజె క్టును పర్యాటకరంగంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టు చెక్కుచెదరకుండా ఉందన్నారు. ఆయన వెంట నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్, మహ్మద్‌నగర్ మండలాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కాం గ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

● వెబ్ సీరీస్‌కు క్లాప్ కొట్టినఎమ్మెల్యే

జుక్కల్ నియోజకవర్గంలో చిత్రీకరణ చేస్తున్న సివరపల్లి అనే వెబ్ సిరీస్‌కు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు క్లాప్ కొట్టారు. మెలోడ్రామా మూ వీ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌లో ప్రొడ్యూసర్ అర్జబ్ కుమార్, భాస్కర్ మౌర్య దర్శకత్వంలో ఈ వెబ్ సిరీస్ తెరకెక్కుతుంది. జుక్కల్ మండలం లోని గుండూర్‌లో ఎమ్మెల్యే క్లాప్ కొట్టి ప్రారంభించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కోటగిరి,మే19: పొతంగల్ మండల కేంద్రంలోని ఓ నిరుపేద కుటుంబానికి చెందిన మైనారిటీ మహిళ శనివారం రాత్రి గుండెపోటుకు గురైంది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా షేక్ అనీస్ మృతి చెందింది. బాధిత కుటుంబానికి మాజీ కోఆప్షన్ సభ్యులు ఎంఏ.అఖిమ్ 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో కుస్తీ పోటీలు


కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం

నిజాంసాగర్, మే 19: నిజాంసాగర్ మండల కేంద్రంలో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతియేటా వీరబ్రహ్మంగారి ఉత్సవాలలో భాగంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. స్థానిక, చుట్టు పక్కల మల్లయోధులతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి మల్లయోధులు విచ్చేసి పోటీల్లో తలపడ్డారన్నారు. పోటీలు తిలకించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూశామన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, సందీప్, లింగా గౌడ్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఎన్ని ప్రమాదాలు జరగాలి

● మోస్రా బ్రిడ్జికి మోక్షం ఎప్పుడో ● ఇబ్బందుల్లో వాహనదారులు ● పట్టించుకోని సంబంధిత అధికారులు


ప్రమాదకరంగా మారిన ఇరుకు బ్రిడ్జి రోడ్డు


బ్రిడ్జి ముందు ఏర్పడిన గుంతలు

మోస్రా,మే19: మోస్రా మండల కేంద్రం శివారులో నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారి హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన రోడ్డు బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి వద్ద రెండు వైపులా రోడ్డు గుంతలు పడి ఉండడం వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. బాన్సువాడ, వర్ని, నిజామాబాద్ ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ఈ బ్రిడ్జి కూడా శిథిలావస్థలో ఉంది. ఈ బ్రిడ్జి కారణంగా ఇప్పటికే చాలా మంది వాహనదారులు గాయాల పాలు కాగా కొందరు కాళ్లు, చేతులు విరిగిన సందర్భాలు ఉన్నాయి. బ్రిడ్జి ఒక వైపుగా ఉంటే ముందే మూలమలలపు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు వాహదారులకు కన్పించే అవకాశంలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా ఈ బ్రిడ్జికి మోక్షాన్ని ప్రసాదించిన సంబంధిత శాఖ అధికారులు బ్రిడ్జిని వెడల్పు పెంచి వాహనదారుల ప్రాణాలు కాపాడాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఆరోగ్యానికి చెరుకు రసం


కోటగిరిలో మొబైల్ చెరకు బండి

కోటగిరి,మే19: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి సహజ సిద్ధమైన పానీయాలు తాగేందుకు జనం ఆసక్తిని కనబరుస్తున్నారు. అలాంటి వాటిలో చెరుకు రసానికి ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. చెరకు రసం గతంలో ఎక్కడో ఒక చోట మాత్రమే లభించేది. ప్రస్తుతం పట్టణాలు, పల్లెల్లో గల్లీ గల్లీల్లో అందుబాటులోకి వచ్చింది. చెరకు బండిపై రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ యువత ఉపాధి పొందుతున్నారు. ఆరోగ్యంగా ఉండడంతో పౌష్టిక విలువలు ఉండడంతో చెరకు రసాన్ని తాగేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. గత రెండు రోజులు మినహా ఎండ వేమిడికి తాళలేక ప్రజలు అల్లాడిపోయారు. వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు బహిరంగ మార్కెట్‌లో చాలా పానీయాలు అందుబాటులో ఉన్నప్పటికీ చాలా మంది ప్రకృతి సిద్ధంగా లభించే చెరకు రసాన్ని తాగేందుకు మొగ్గు చూపుతున్నారు. ఎన్నో విటమిన్లు కలిగిన ఈ రసాన్ని తాగేందుకు ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

● జోరుగా చెరుకు రసాలు అమ్మకాలు

రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలు కుటుంబాలు ఈ ప్రాంతానికి వలస వచ్చాయి. జిల్లాలోకి కోటగిరి, వర్ని, బీర్కూర్, బోధన్, ఎడపల్లి, నవీపేటతో పాటు పలు ప్రాంతాలలో సీజన్‌కు తగిన విధంగా వ్యాపారాలు నిర్వహిస్తూ జీవిస్తున్నారు. ప్రత్యేకంగా మొబైల్ చెరకు రసం బండ్లను తయారు చేసి పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో తిరుగుతున్నారు. ఇళ్ల ఎదుటకే వాహనాలను తీసుకువచ్చి తాజా రసాన్ని తయారు చేసి ఇస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు, వారి పిల్లలకు రోజు ఒక గ్లాస్ చొప్పున చెరకు రసం తాగిస్తున్నారు. గ్లాస్ జ్యూస్ ధర 10, 20రూపాయల వరకు విక్రయిస్తున్నారు.

● ఉపయోగాలు బోలెడు

చెరకు రసం శరీర వేడిని తగ్గించి శక్తిని ఇస్తుంది. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటుగా జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లను తొలగిస్తుంది. రసంలో క్రోమియం, మెగ్నిషియం, జింక్ వంటివి అధికంగా ఉంటాయి. శరీరంలో గ్లూకోజ్ లెవల్స్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు కామెర్లు, ఇన్‌ఫెక్షన్లను రానివ్వదు. అలసటను తగ్గించి అసయాన్ని దూరం చేస్తుంది. పిల్లల్లో తరుచుగా వచ్చే చిన్నపాటి ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. రోజు తాగితే శరీర బరువు క్రమేపి తగ్గుతుంది. అందులో ఉండే కాల్షియం ఎముకలు, కండరాలకు శక్తిని ఇస్తుంది.

ఔషధంలా పని చేస్తుంది



వేసవిలో ప్రజలకు చెరకు రసం దివ్య ఔషధంలా పని చేస్తుంది. అందులో ఉండే కాల్షియం కారణంగా ఎముకలు, దంతాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. చిన్నారులకు చెరకు రసం చాలా మంచిది. పైగా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా కాపాడే ఔషధ గుణాలు ఉన్నాయి.

- గోవర్ధన్, మండల విస్తరణ అధికారి, కోటగిరి

ఈ ఏడాదైనా కళాశాల ప్రారంభమయ్యేనా?

● పేరుకే కాలేజ్ ● బోధన సిబ్బంది, విద్యార్థులు లేని దుస్థితి


మండల కేంద్రంలో ప్రారంభమైన పాఠశాల అదనపు గదులు ఇవే

నిజాంసాగర్, మే 19: నిజాంసాగర్ మండల కేంద్రంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు అధికార యంత్రాంగం గత ఆగస్టు మాసంలో హుటా హుటీన అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించారు. కనీసం 10 మంది కూడా అడ్మిషన్ తీసుకోలేదు. 40 మంది పిట్లంలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులను నిజాంసాగర్ కాలేజీలో చేర్పారు. కళాశాలలో బోధన సిబ్బంది, విద్యార్థుల ఊసే లేకుండా పోయింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నూతనంగా నిర్మాణం చేపట్టిన తరగతి గదుల్లో కళాశాలను ప్రారంభించారు. ఈ కళాశాల నిర్వహణ పిట్లం జూనియర్ కళాశాల ప్రధానాచార్యులకు అప్పగించారు. బోధన, బోధనేతర సిబ్బందిని కూడానియమించలేదు. పేరుకే నిజాంసాగర్‌లో జూనియర్ కళాశాలగా ఉంది. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ తదితర గ్రూపులలో విద్యాభ్యాసం కొనసాగనుంది. కానీ వచ్చే విద్యా సంవత్సరం ఈ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందినినియమించి, గ్రూపుల్లో అడ్మిషన్లు తీసుకునేరా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ కళాశాల నిజాంసాగర్ మండలంలో కొనసాగితే మండలంలోని 7 ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే 10వ తరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకు వీలు కలుగుతుంది. ఈ కళాశాల నిజాంసాగర్ మండల కేంద్రంలో ఈ విద్యా సంవత్సరం పునఃప్రారంభమైతే ఉన్నత పాఠశాలల విద్యార్థుల విద్య కొనసాగుతుంది.ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని కళాశాలను విద్యా సంవత్స రంలో పూర్తిస్థాయిలో కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలి

సిరికొండ మే 19: వరంగల్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీకి చెందిన ముగ్గురు దళనాయకులను వెంటనే విడుదల చేయాలని నిజామాబాద్ జిల్లా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా సరిహద్దులో శనివారం అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని భాస్కర్ తీవ్రంగా ఖండించారు.అనారోగ్యానికి గురైన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ దళనాయకులు రాజన్న,జీవన్,దేవ్ రెడ్డి చికిత్సా చేయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారని ఆయన అన్నారు. ముగ్గురు నాయకులకు ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పరుచాలని భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు.వారికి ఎలాంటి ఆపద తలపెట్టవద్దని భాస్కర్ కోరారు.



పిట్లంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం దృశ్యం

పిట్లంలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

పిట్లం మె 19: మండల కేంద్రంలోని శ్రీరామాలయము కాలనీలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మి కాంతారావ్ ఉపాధిహామీ నిధులు రూ.10 లక్షలతో శ్రీరామాలయ కాలనీలో సీసీ రోడ్డుకు మంజూరు చేశారని అన్నారు. కాలనీలో సరైన రోడ్డు లేక వర్షాకాలంలో కాలనీవాసులు ఇబ్బందులు పడేవారని, సీసీ రోడ్డు వేయడంతో సమస్య తీరిందన్నారు. సీసీ రోడ్డు పనులు చేయడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు శివ, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి దోమకొండలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు

దోమకొండ, మే19: మండల కేంద్రంలోని శ్రీరేణుకాఎల్లమ్మ 19వ వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహిస్తున్నట్లు రేణుకా ఎల్లమ్మ దేవాలయ కమిటీ, గౌడ సంఘం సభ్యులు తెలిపారు. 20న సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనము, అమ్మవారికి అభిషేకము, అలంకరణ, హారతి, మంత్ర పుష్పము, తీర్థప్రసాద వితరణ, 21న మంగళవారం ఉదయం శ్రీరేణుకా ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణము, అమ్మవారికి ఓడిబియ్యం సమర్పణ, తీర్థప్రసాద వితరణ, రాత్రి అమ్మవారికి బోనాల సమర్పణ, రాత్రి 9గంటలకు మిద్దె రామాగౌడ్ శిష్య బృందంచే ఒగ్గు కథ ఉన్నట్లు తెలిపారు. 22న బుధవారం ఉదయం తిరుగు బోనాలు, పుట్ట ఎల్లమ్మ వద్ద కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగభూషణంగౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు రాజనర్సాగౌడ్, ఉపాధ్యక్షుడు కర్రోల్ల శ్యాంసుందర్‌గౌడ్, నర్సాగౌడ్, సెక్రటరీలు వెంకటిగౌడ్, రవిగౌడ్, కోశాధికారి హరిగౌడ్, యాదగౌడ్, మాజీ గౌడ సంఘం అధ్యక్షులు బీమాగౌడ్, సుదర్శన్‌గౌడ్, ప్రసాద్ గౌడ్, రామాగౌడ్, శ్రావణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వరదల కాలం వస్తుంది.. వంతెనల సంగతేంటి?



విఠల్‌వాడీ సమీపంలో శిథిలావస్థకు చేరిన వంతెన

పెద్ద కొడప్‌గల్, మే19: వేసవి మరికొద్ది రోజుల్లో ముగిసి వర్షాకాలం ప్రారంభం కానుంది. భారీగా వర్షాలు కురిస్తే వాగులు, వంకలు నిండుగా వరద నీటితో ప్రవహియిస్తాయి. ఇంతవరకు బాగానే ఉన్నా వాగులు, వంకలు వరద నీటితో ప్రవహిస్తే మండలంలోని పోచారం గ్రామం పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. పోచారం గ్రామం నుంచి బయటకు రావాలంటే గ్రామ సమీపంలో వాగు దాటి రావాల్సి ఉంటుంది. ఈ వాగుపై గతంలో నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రతి సంవత్సరం వానకాలంలో భారీగా వర్షాలు కురిసిన సమయంలో ఈ గ్రామం నుంచి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో అత్యవసర పనుల నిమిత్తం వెల్లవలసిన వారు వరదనీరు తగ్గేంత వరకు ఆగుతారు. గత సంవత్సరం వర్షాకాలంలో వంతెనపై నుంచి నీరు ప్రవహించడంతో కొన్ని పశువులు కూడ కొట్టుకుపోయాయి. ప్రతిసారి ఇలా జరగడంతో పోచారం గ్రామ ప్రజలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ సారి ఎన్నికల సమయంలో తమ సమస్యను ప్రజా ప్రతినిధులకు విన్న వించిన ఫలితం లేదని వాపోతున్నారు.

• శిథిలావస్థలో విఠల్‌వాడీ తండా వంతెన



పోచారం గ్రామ శివారులో ధ్వంసమైన వంతెన

మండలంలోని విఠల్‌వాడీ- విఠల్‌వాడీ తండాలను కలిపే వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన పై నుంచి పెద్దకొడప్‌గల్ మండల కేంద్రానికి విఠల్‌వాడీ, లింగంపల్లి, బాబల్‌గాం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుని ఒకవైపు పూర్తిగా కూలిపోయింది. ఒకవైపు నుంచి మాత్రమే వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. గత వర్షాకాలంలోనే ఈ వంతెన కూలిపోయే దశకు చేరింది. ఈ వంతెన కూడా నూతనం గా నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులతోపాటు, ప్రజాప్రతిని ధుల దృష్టికి తీసుకొచ్చారు. నూతనంగా వంతెన నిర్మాణానికి ప్రతిపాద నలు పంపాలని జుక్కల్ ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో ఈ వంతెన కూలిపోతే విఠల్‌వాడీ తండా నుంచి ఆయా గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలిగే పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే మరి.

సంగోజీపేట్‌లో పడకేసిన పారిశుధ్యం

• ఎక్కడికక్కడ పేరుకున్న చెత్తాచెదారం • కంపోస్టు షెడ్డు నిర్మించినా నిరుపయోగంగానే.. • అస్తవ్యస్తంగా డ్రైనేజీ కాల్వలు • రోగాల బారిన పడుతున్న ప్రజలు • కన్నెత్తి చూడని అధికారులు



చెత్తాచెదారంతో నిండి ఉన్న డ్రైనేజీ కాల్వ



వృథాగా ఉన్న కంపోస్టు షెడ్డు



కంపోస్టు షెడ్డులో చెత్తకు బదులుగా బీరు సీసాలు

బాన్సువాడ, మే19: పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్నారు.. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందంటారు. కానీ పల్లెలు అస్తవ్యస్తంగా మారుతున్నా కనీసం పటిటంచుకోవడం లేదు. చెత్తాచెదారం, మురికి నీటితో కంపుకొడుతున్నాయి. గ్రామంలో ఎక్కడ చూసిన చెత్తాచెదారం కన్పిస్తోంది. బాన్సువాడ మండలం సంగోజీపేట గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. పేరుకున్న చెత్తాచెదారాన్ని గత ప్రభుత్వం కంపోస్టు షెడ్‌లు నిర్మించి తడి చెత్త, పొడి చెత్త ప్లాస్టిక్ వంటి తదితర అనేక వస్తువులను వేరు చేసి కంపోస్టు షెడ్డులో వేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు కంపోస్టు షెడ్డులో కేవలం బీరు సీసాలకే పరిమితమైందని చెప్పుకోవచ్చు. కంపోస్టు షెడ్డులో ఏ వస్తువులకు ఆ వస్తువులు వేయాల్సి ఉన్నా గ్రామ అధికారులు పర్యవేక్షించకపోవడంతో గ్రామంలోని చెత్తను రోడ్డుపక్కనే పారవేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఆ చెత్తాచెదారంతో వెదజల్లే దుర్వాసనతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా చెత్తచెదారాన్ని వేరుచేసి కంపోస్టు షెడ్డులో నిర్వహణ చేయాల్సి ఉన్నప్పటికీ వృధాగానే ఉంచారు అధికారులు. ఇదిలా ఉంటే గ్రామంలోని డ్రైనేజీల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుని మురికి నీరుతో అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. నీరు సరఫరా లేక మురికి నీరు చేరి దోమలు వ్యాపించి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోతున్నారు. అధికారులు కనీసం పర్యవేక్షించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి కంపోస్టు షెడ్డు నిర్మించినప్పటికీ ఎందుకు వాడటం లేదని చెత్తాచెదారాన్ని అందులో ఎందుకు వేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామ కార్యదర్శి, మండల అధికారులు జిల్లా ఉన్నతాధికారులు వెంటనే గ్రామాన్ని పారిశుధ్య లోపం లేకుండా స్వచ్ఛమైన గ్రామంగా తీర్చిదిద్దేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

• మందుబాబులకు అడ్డగా..

సంగోజీపేట గ్రామంలోలక్షలు వెచ్చించి కంపోస్టు షెడ్డు నిర్మించినప్పటికీ గ్రామంలోని చెత్తాచెదారాన్ని కంపోస్టు షెడ్డులో వేయాల్సి ఉన్నప్పటికీ రోడ్డు పక్కనే పార వేయడంతో కంపోస్టు వృధాగా పడి ఉంది. అంతేకాకుండా మందుబాబులకు అడ్డగా మారిందని ప్రజలు వాపోతున్నారు. కంపోస్టు షెడ్డు వృధాగా ఉండటంతో మందుబాబులు కంపోస్టులోని రాత్రివేళలో మద్యం సేవించి బీరు సీసాలు మందు బాటిళ్లు కంపోస్టు షెడ్‌లో వేసి వెళ్లడం జరుగుతుందని ప్రజలు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కంపోస్టు వాడుకలోకి తీసుకువచ్చి చెత్తాచెదారాన్ని వేరు వేరుగా కంపోస్టులో వేసి గ్రామాన్ని అభివృద్ధి బాటలో తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే పడవేసిన చెత్తా చెదారం

• అస్తవ్యస్తంగా డ్రైనేజీలు

గ్రామంలో డ్రైనేజీ శుభ్రపరచాల్సి ఉన్నప్పటికీ గ్రామ కార్యదర్శి పర్యవేక్షణ లేక గ్రామంలో డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోయి మురికి నీటితో నిండి ఉంది. దీంతో దోమలు వ్యాపించి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరిచి నీరు నిల్వ ఉండకుండా చెత్తాచెదారాన్ని తొలగించి ప్రజలను రోగాల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం..

• సత్యనారాయణ, ఎంపీవో, బాన్సువాడ

గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే శుభ్రపరిచేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ కార్యదర్శికి వివరణ కోరుతాం. కంపోస్టు షెడ్ నిర్వహణపై విచారణ చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తాం. పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

రైతులకు రూ.10.40 లక్షల పరిహారం అందజేత



మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బాధిత రైతులు

బీర్కూర్, మే 19 : బీర్కూర్ మండల కేంద్రంలో మన గ్రోమోర్ విత్తనాలు కొనుగోలు చేసి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందజే శారు. పంట నష్టపోయిన రైతులకు ఈ విషయంలో మన గ్రోమోర్ కేంద్రం ఎదుట పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు చేశారు. రైతులు ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లారు. తమకు నష్ట పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం విత్తన కంపెనీ ప్రతినిధులతో మాజీ ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. పరిహారం వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, లేనిపక్షంలో పీడీ యాక్టు కేసు నమోదు చేయించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో కంపెనీ ప్రతినిధులు స్పందించి రైతుల పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ క్రమంలో విత్తన కంపెనీ ప్రతినిధులు, యజమాన్యం 17మంది రైతులకు రూ.10 లక్షల 40వేల పంట నష్ట పరిహారం విడుదల చేసింది. 17మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నష్ట పరిహారం తాలూకు డబ్బులు జమచేసింది. ఈ మేరకు రైతులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రవీందర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులను రైతులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీర్కూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చందూ, యామ రాములు, బస్వరాజు, కృష్ణ, అఫ్సర్, క్యాకప్ప, బండ సాయిలు, రైతులు మురళి, మహేష్, పేరయ్య, లక్ష్మణ్, అనిల్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతపై సాగు భారం

• అకాల వర్షాలతో జిల్లాలో మొదలైన దుక్కులు • రెట్టింపు పెట్టుబడి వ్యయం • పెట్టుబడి వ్యయంతో ఆందోళనలో రైతులు



వేసవి దుక్కులు దున్నుతున్న దృశ్యం

ఎల్లారెడ్డి, మే19: వ్యవసాయమే ప్రధాన జీవన ఆధారమైన జిల్లాలో రోజురోజుకూ పెట్టుబడి వ్యయం సాగుభారం ఎక్కువ అవుతుంది. ఏటా పెరుగుతున్న పెట్రోల్, డీజీల్ ధరలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో వానాకాలం పంటల సాగుకు భూములు సిద్ధం చేసేపనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వేసవి పనులు జోరుగా సాగుతున్నాయి. డిజీల్ ధరలు విపరీతంగా పెరగడంతో సన్నచిన్నకారు రైతులపై మరింత సాగు భారం పడుతోంది. ఒక్కో గ్రామంలో 5నుంచి 10 ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. పెరిగిన ఇంధనధరలతో పంటల సాగు చేయడం కష్టమవుతుందని అభిప్రాయం వ్యక్తం అవుతున్నాయి. ఏటేటా పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్న దానికి అనుగుణంగా మద్దతు ధరలు పెరగడకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం పెట్రోల్, డీజీల్ ధరలు అధికంగా ఉన్నాయి.

• పెరుగుతున్న అద్దె ధరలు

ఇంధన ధరలకు అనుగుణంగానే ట్రాక్టర్ యజమానులు అద్దె ధరలను పెంచేయడంతో అన్నదాతలపై అదనంగా భారం పడుతోంది. ఏటా గంటకు 100 నుంచి 200 వకు అద్దెలను పెంచుతున్నారు. ఎందుకుంటే డిజిల్ ధరలు పెరగడంతో తమకేమి గిట్టుబాటు కావడం లేదని ట్రాక్టర్ యజమానులు పేర్కొంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేసేలా రైతులు సాగు పనుల్లో యంత్రాలను ఎక్కువ వినియోగిస్తున్నారు. ప్రతీ పనిని యంత్రాల సహాయంతోనే చేపడుతున్నారు. ప్రస్తుతం యంత్రాలతో వేసవి దిక్కులు దున్నడం పనులు చేపడుతున్నారు. వానాకాలం పంటల సాగుకు పంట పొలాలను చదును చేయడం, చెరువులను, కుంటల నల్ల మట్టి సేంద్రీయ ఎరువులను తరలించడం లాంటి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అయితే ఇంధన ధరలు పెరిగాయన్నసాకుతో ట్రాక్టర్ యజమానులు అద్దెలను అమాంతంగా పెంచేస్తున్నారు. గత్యంతరం లేక రైతులు ట్రాక్టర్ యజమానులనే ఆశ్రయించాల్సి వస్తోంది.

• ఏటా రూ. కోట్ల భారం...

ఇంధన ధరలు పెరిగిపోవడంతో జిల్లా రైతాంగంపై యేటా కోట్ల రూపాయల భారం పడుతోంది. జిల్లాలో మొత్తం 3,16,560 మంది రైతులు ఉండగా 5,14,290 ఎకరాలలో ప్రతీయేటా వివిధ పంటలను సాగు చేస్తున్నారు. దుక్కి దున్ని అప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయి. గతంలో ఎకరానికి 10 వేల నుంచి 15 వేల వరకు ఖర్చు అయ్యేది. కానీ ప్రస్తుతం 20 వేల నుంచి 30 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతుందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కూలీల కొరతతో యంత్రాల వినియోగం విపరీతంగా పెరిగిపోతుందన్నారు. దీంతో ఏటా రూ. కోట్ల భారం రైతులపై పడుతోంది.

ఎస్సారెస్పీలో తేలిన కుస్తాపూర్ మల్లన్నగుడి



ఎస్సారెస్పీ జలాశయంలో తేలిన మల్లన్నగుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ముప్కాల్, మే 19: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపు గ్రామం కుస్థాపూర్ మల్లన్న గుడి తేలిం ది. ఐదేళ్ల తర్వాత ప్రాజెక్టు నీటి మట్టం డెడ్‌స్టోరేజీకు చేరడంతో కుస్థాపూర్ మల్లన్న బయటప డింది. దీంతో చుట్టు పక్కల గ్రామాల భక్తులు తరలివచ్చి పూజలు చేస్తున్నారు. బాల్కొండ మండలం నాగాపూర్, బస్సాపూర్ గ్రామాల ఆరాధ్యదైవంకు కుస్థాపూర్ మల్లన్న ప్రాజెక్టు నిర్మాణంలో ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల 91గ్రామాలు ముంపుకు గురయ్యాయి. ఇప్పటి ప్రభుత్వం ముంపు గ్రామాలకు ధర్మపురి, జగిత్యాల్, మెట్‌పల్లి ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చింది. కొందరు బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో స్థిరపడ్డారు. ప్రాజెక్టు నీరు తగ్గితే మల్లన్న ఆలయంతో పాటు మరో శివాలయం బయటపడుతుంది. నీటిమట్టం తగ్గడంతో ముంపు గ్రామాలు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు గుట్టపై ఉన్న మల్లన్నను దర్శించుకునేందుకు వెళ్తున్నారు. మొన్నటి వరకు మల్లన్నగుడి వద్దకు వెళ్ళే మార్గంలో నీరు ఉండడంతో కాలినకడన వెళ్ళి పూజలు చేశారు. ఇప్పుడు నీరు తగ్గుముఖం పట్టగా ఆలయం వరకు వాహనాలు వెళ్తున్నాయి. మల్లన్నకు ఆదివారం ప్రీతికమైన రోజు కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 19: గిరిజన విద్యార్థుల కోసం బెస్ట్ అవలెబుల్ స్కీమ్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి నాగోరావు తెలిపారు. దరఖాస్తులు ఈనెల 21 నుంచి జూన్ 6 వరకు గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



ట్రాక్టర్‌ను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించిన దృశ్యం

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బీబీపేట, మే 19: మండలంలోని మల్కాపూర్ గ్రామశివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను ఎస్సై ప్రభాకర్ శనివారం రాత్రి పట్టుకున్నారు. డయల్ 100కు ఫిర్యాదు రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి మల్కాపూర్ గ్రామానికి చెందిన బోల్‌గాని నవీన్, సామనోల్ల ప్రశాంత్ అనుమతులు లేకుండా ఇసుకను నింపుతుండడంతో వారి ట్రాక్టర్‌లను సీజ్ చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో దొంగల అలజడి



ఇంట్లోని వస్తువులను చిందరవందరగా వేసి ఉన్న దృశ్యం

కామారెడ్డి టౌన్, మే19: జిల్లా కేంద్రంలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ ఎవరూ లేని సమయంలో దుండగులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. శనివారం రాత్రి జిల్లాకేంద్రంలోని రాజానగర్ కాలనీలో నివాసముండే శ్రీకాంత్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తన ఇంటితాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు చొరబడి తొమ్మిది తులాల బంగారు అభరణాలు, 2వేల నగదు, 15 తులాల వెండిని దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితుడు శ్రీకాంత్ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బాన్సువాడలో గుర్తుతెలియని మహిళ, బాలుడి మృతదేహాలు లభ్యం

బాన్సువాడ, మే19: బాన్సువాడ పట్టణంలోని న్యూవీక్లీ మార్కెట్ సమీపంలో కొత్తగా నిర్మాణం అవుతున్న భవంతిలో 30 నుంచి 35 ఏళ్ల గుర్తుతెలియని మహిళ మృతదేహం, 6 నుంచి ఎనిమిదేళ్ల బాలుడి మృతదేహాలను ఆదివారం ఉదయం 11గంటలకు గుర్తించినట్లు బాన్సువాడ పట్టణ సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు. మృతదేహాలు కుళ్లిపోయి ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని కుళ్లిపోయిన రెండు మృతదేహాలను న్యూవీక్లీ మార్కెట్ దగ్గరలోని కొత్తగా నిర్మాణం అవుతున్న భవనంలోని షెటర్‌లో ఓ మహిళ, బాలుడు చనిపోయి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వచ్చి చూడగా మహిళ, బాలుడు మృతి చెంది మూడు నుంచి నాలుగు రోజులు అయి ఉండవచ్చునని తెలిపారు. మృతి చెందిన వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, ఒంటిపై లేత గోధుమ రంగు టాప్, నలుపు రంగు పాయింట్ దుస్తులు ధరించి, ఎత్తు ఐదు ఫీట్ల పొడవు కలిగి ఉన్నాడని, బాలుడు ఆకుపచ్చ టీ షర్ట్, కాషాయం రంగు కలిగిన నిక్కర్ ఉందని తెలిపారు. మృతదేహాలను బాన్సువాడ పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలోకి మార్చురీకి తరలించామన్నారు. ఎవరైనా మృత దేహాల వివరాలు తెలిసిన వారు బాన్సువాడ పట్టణ సీఐ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

దోమకొండ, మే 19: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కానుగంటి శారద అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి మండల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఈ సందరర్భంగా ఆయన కోరారు.

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

